నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 7 జనవరి 2024 | ADILABAD

బోథ్‌లోని కండ్రివాగుపై వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్

పేదలకు పథకాలు అందేలా చూడాలి..

ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా టౌన్, జనవరి 6 : పేదలకు పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అధికారులకు సూచించారు. శనివారం నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మహాగాంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఐరు గ్యారెంటీల్లో ఒకటైన మహాలక్ష్మీ పథకాన్ని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిందని, మిగతా ఐదు పథకాలను దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యాక అమలు చేస్తుందన్నారు. డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, సర్పంచ్ రాకేశ్, ఎంపీటీసీ పోశెట్టి పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంతో మెరుగైన రవాణా

బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్

బోథ్, జనవరి 6 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ సమీపంలోని కండ్రివాగుపై వంతెన నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం ఖండిపల్లె(పాత)లో శ్రీ రామారావ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. ధన్నూర్(బీ) పాఠశాలలో రూ.21 లక్షలతో 'మన ఊరు-మన బడి' నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కండ్రివాగు వంతెన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం బోథ్-నిగిని రోడ్డు నిర్మాణాన్ని రూ.15 కోట్లతో పూర్తి చేసిందన్నారు. వంతెన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ నుంచి రూ.2.25 కోట్లు మంజూరయ్యాయన్నారు. వంతెన పూర్తయితే 15 గ్రామాల ప్రజలతోపాటు కైలాస్‌టేకిడి, మహారాష్ట్ర వైపు వెళ్లే ప్రజలు, బోథ్ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు తుల శ్రీనివాస్, నిమ్మల ప్రీతంరెడ్డి, సర్పంచ్ సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ డీ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్ రుక్మణ్‌సింగ్, బీ శ్రీధర్ రెడ్డి, కే ప్రశాంత్, ఎం సుభాష్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో పలువురి అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమేందర్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమేందర్

ఎదులాపురం, జనవరి 6 : ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్ కౌన్సిలర్ రఘుపతి కూతురు, దళిత యువకుడైన వంశీ కొంతకాలం గా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రఘుపతి రేండేండ్ల క్రితం వంశీని బెదిరించాడు. అయినప్పటికీ ప్రేమికులు మాట్లాడుకునేవారు. రఘుపతి ఎలాగైనా వంశీని చంపాలని నిర్ణయించుకున్నాడు. నవంబర్ 25, 2023న అప్పుడే జైలు నుంచి వచ్చిన చౌహాన్ రవి,అశోక్‌లతో రూ.15 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. పథకం ప్రకారం.. వంశీని జీపుతో ఢీకొట్టి చంపాలని ప్రణాళిక రూపొందించారు. అడ్వాన్స్‌గా రూ. ఒక లక్ష చెల్లించాడు. ఎన్నికలు ఉన్నందున ఆగాలని, తరువాతనే హత్య చేయాలని సూచించాడు. రఘుపతి భార్య అరుంధతి కూడా వంశీని చంపి తమ పరువు కాపాడాలని కోరింది. రవి తనకు వచ్చిన డబ్బుల నుంచి రూ.5 లక్షలు అశోక్‌కు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. రవి,అశోక్‌లు దిల్షాద్ ద్వారా రాజు అనే వ్యక్తికి రూ.50 వేలు ఇచ్చి జీపు తీసుకున్నారు. పలుమార్లు వంశీ ఇంటిపై రెక్కీ నిర్వహించారు. డిసెంబర్ 18న రవి,అశోక్‌లు కమాండర్ జీపుతో వంశీని ఢీకొట్టగా.. వంశీకి గాయాలు అయ్యాయి. రఘుపతి తనపై అనుమానం వస్తుందని తన కారు(టీఎస్ 01ఇఎం0099)లో పారిపోయాడు. వంశీ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి డిసెంబరు 23న చౌహాన్ రవి, అశోక్, దిల్షాద్, రాజులను వీరికి సహకరించిన గంగన్నను అరెస్ట్ చేసి రిమాండుకు పంపారు. పరారీలో ఉన్న రఘుపతిని అరెస్ట్ చేసి రిమాండుకు పంపారు. కాగా.. రఘుపతి భార్య అరుంధతి హైకోర్టు నుంచి బెయిల్ పొందింది.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం అర్జీలు **9,48,666**

- డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు కొనసాగిన గ్రామసభలు
- దరఖాస్తులు స్వీకరించిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆధార్ కోసం అవస్థలు పడ్డ ప్రజలు

ఆదిలాబాద్, జనవరి 6(నమస్తే తెలంగాణ) : అభయ హస్తం పథకంలో భాగంగా ఐదు గ్యారెంటీల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. డిసెంబర్ 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన పేరిట గ్రామసభలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేసి ఎనిమిది రోజులపాటు అర్జీలు తీసుకున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోల పర్యవేక్షణలో గ్రామసభలు కొనసాగాయి. కాగా.. జైనథ్ మండలంలోని జామ్నిలో ప్రజాపాలనను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభించగా.. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని స్వీకరించారు. అధికారులు మాత్రం దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఆదేశించారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్(ఫైల్)

ఆధార్ కోసం ఇబ్బందులు

ప్రజాపాలన దరఖాస్తులకు రేషన్, ఆధార్ కార్డులు తప్పనిసరిగా జతపర్చాలని ప్రభుత్వం సూచించింది. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుటుంబసభ్యుల చేరికలు, చిరునామా మార్పు, ఫోన్ నంబరు పొందపర్చడం కోసం ఆధార్ కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాశారు. ఆధార్ అప్‌డేట్ విషయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో కేంద్రాలు జనంతో రద్దీగా కనిపించాయి. దరఖాస్తుల స్వీకరణను జిల్లా అధికారులు పకడ్బందీగా పర్యవేక్షించారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా నెలకు రూ. 2,500ల ఆర్థిక సాయం, రూ.500 సిలిండర్, రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరానికి రూ.15వేలు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ఏడాదికి రూ.12 వేలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గృహజ్యోతి పథకంలో భాగంగా నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత పథకానికి దరఖాస్తులు అందజేశారు. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి ప్రశాంతి, కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్లు, అధికారులు గ్రామసభలను పరిశీలించారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు

జిల్లా	అర్జీలు
ఆదిలాబాద్	2,24,136
నిర్మల్	2,80,489
ఆసిఫాబాద్	1,60,779
మంచిర్యాల	2,83,262

4,49,980

ఆదిలాబాద్ జిల్లా ఓటర్లు

- ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- ఈ నెల 22 వరకు అభ్యంతరాల స్వీకరణ
- కొత్త ఓటరు నమోదుకు అవకాశం

ఆదిలాబాద్, జనవరి 6(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ విడుదల చేశారు. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు ఉండగా.. 4,49,980 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 2,20,107.. మహిళలు 2,29,865 మంది ఉన్నారు. ఇతరులు 12 మంది, సర్వీస్ ఓటర్లు 784 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 9,758 మంది అధికంగా ఉన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,41,616 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 1,18,666.. మహిళలు 1,22,944, ఇతరులు ఆరుగురు, వీరితోపాటు 12 మంది ఎన్ఆర్ఐలు, 233 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. బోథ్ నియోజకవర్గంలో 2,09,364 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 1,01,441.. మహిళలు 1,06,921.. ఇతరులు ఇద్దరు, 551 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

22 వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

ముసాయిదా ఓటరు జాబితాను కలెక్టర్ కార్యాలయం, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కార్యాలయం, ఆయా పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ నెల 22 వరకు జాబితాపై అభ్యంతరాల స్వీకరణతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. కొత్త ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20, 21 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీలోగా అభ్యంతరాలు, క్లెయిమ్స్ పూర్తిస్థాయిలో పరిష్కరించి 8న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు.

బాధిత కుటుంబాలకు రామన్న పరామర్శ

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి జోగు రామన్న

జైనథ్, జనవరి 6 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కాప్రి, బాలాపూర్ గ్రామాలకు చెందిన తిప్పారెడ్డి, సుభాష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న శనివారం ఇరు కుటుంబాల సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. సుభాష్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ గోవర్ధన్, నాయకులు లింగారెడ్డి, సర్పంచ్ వినోద్ యాదవ్, ఎంపీటీసీ రాంరెడ్డి, గోవిందరావ్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస పరీక్షకు హాజరైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీటీసీలు

నిలిచిన ఇన్‌చార్జి ఎంపీపీపై అవిశ్వాస పరీక్ష

- హైకోర్టు స్టేతో బ్రేక్
- ఆర్డీవో రత్నకల్యాణి వెల్లడి

సారంగాపూర్, జనవరి 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల ఇన్‌చార్జి ఎంపీపీ పతాని రాధపై శనివారం అవిశ్వాస పరీక్ష ఉండగా, హైకోర్టు స్టేతో నిలిచింది. ఏడుగురు బీజేపీ ఎంపీటీసీలు, ఇద్దరు బీఆర్ఎస్ ఎంపీటీసీలు కలిసి డిసెంబర్ 14వ తేదీన అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఆర్డీవో రత్నకల్యాణికి అందించారు. అదే నెలలో ఆర్డీవో మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వచ్చి 14 మంది ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేసి, ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని తెలిపారు. అయితే శనివారం అవిశ్వాస పరీక్షకు బీజేపీ ఎంపీటీసీలు రాథోడ్ రాజు, సామల పద్మ, సిద్ధాపూర్ సురేఖ, రాథోడ్ మీరాబాయి, లక్కాడి లయ, మేకల లక్ష్మణ్, ఎగ్గం సరిత, రాథోడ్ సవితబాయి.. కాంగ్రెస్ ఎంపీటీసీ వెంకట రమణారెడ్డి మాత్రమే హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇన్‌చార్జి ఎంపీపీ పతాని రాధ, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు మహిపాల్ వనజ, గడ్డం భోజారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ హాజరు కాలేదు. రాధ అవిశ్వాసం ఆపాలని స్టే కోసం హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు శుక్రవారం అవిశ్వాసం ఈనెల 10 తేదీ వరకు అంటే ఐదు రోజులు నిలిపి వేయాలని గడువు విధించింది. హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీని ఇన్‌చార్జి ఎంపీపీ శనివారం ఆర్డీవోకు అందజేశారు. దీంతో అవిశ్వాశాన్ని నిలిపి వేశారు. మళ్లీ ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

సారూ.. జీతాలు..

ఆర్థిక ఇబ్బందుల్లో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

- వేతనాల కోసం ఎదురుచూపు
- నిర్మల్ జిల్లాలో 659 మంది ఉద్యోగులు
- కొత్త సర్కారుతో ప్రారంభమైన అవస్థలు

నిర్మల్ అర్బన్, జనవరి 6 : 'అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి' అనే నినాదంతో ముందుకు సాగుతున్న సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు జీతాలు రాక అవస్థలు పడుతున్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో మొదటి వారం రోజులు లోపు జీతాలు పొందారు. ఎన్నికల నేపథ్యంలో ఒక నెల జీతం మాత్రం ఆగింది. కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా వీరికి జీతాలు మాత్రం రావడం లేదు. విద్యాశాఖలో కీలకంగా వ్యవహరించే వీరికి వేతనాలు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నారు. నిర్మల్ జిల్లాలో సమగ్ర శిక్షా ఉద్యోగులు 659 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో డీపీవో(డాటా ఎంట్రీ ఆపరేటర్లు) 8 మంది, కేజీబీవీ కాంట్రాక్ట్ ఉద్యోగులు, స్పెషల్ ఆఫీసర్లు 18, సీఆర్‌టీలు, పీజీసీఆర్‌టీలు, నాన్ టీచింగ్ స్టాఫ్ 440, యూఆర్ఎస్ స్టాఫ్ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్‌టీలు, అకౌంటెంట్స్, అటెండర్లు, డే, నైట్ వాచ్ ఉమెన్‌లు, స్కావెంజర్లు, వంట చేసే వారు 13, ఎంఆర్‌సీ ఉద్యోగులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీర్పీలు 180 మంది విధులు నిర్వహిస్తున్నారు.

దీక్ష చేపట్టిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు(ఫైల్)

ఎన్నికల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి..

సమాన పనికి.. సమాన వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలను అందించాలని, తమను క్రమబద్ధీకరించాలనే డిమాండ్లతో గతేడాది సెప్టెంబర్‌లో 20 రోజులకు పైగా సమ్మె బాట పట్టారు. తాను అధికారంలోకి వస్తే ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. క్రమబద్ధీకరణ సంగతి దేవుడెరుగు.. ముందు రెండు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను త్వరగా చెల్లించి, ఆర్థిక ఇబ్బందులను దూరం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వేతనాలను చెల్లించాలి..

రెండు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందుల కు గురవుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేయించుకుంటున్నప్పటికీ వేతనాలు ఇవ్వడంతో తీవ్ర జాప్యం చేస్తున్నారు. రెండు నెలల నుంచి కుటుంబ పోషణ భారంగా మారింది. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. *- రాజారత్నం, సీఆర్పీ, బీరవెల్లి.*

క్రమబద్ధీకరించాలి..

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న మాకు సమాన పనికి సమాన వేతనం అందించాలి. దేశంలోని ఒరిస్సా, హర్యాన, ఢిల్లీ, మహారాష్ట్రలో మాలాంటి ఉద్యోగులను అక్కడి ప్రభుత్వాలు క్రమబద్ధీకరించాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. నెరవేర్చి న్యాయం చేయాలి. *- బి.నవిత, ఎస్వో, లక్ష్మణచాంద.*

సారంగాపూర్ మండలంలోని యాకర్‌పెల్లిలో బడి బయట పిల్లలను గుర్తించిన సీఆర్‌పీ

తుదిదశకు సర్వే

- సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో వివరాల సేకరణ
- జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు బడి బయట పిల్లలు 155 మంది గుర్తింపు

నిర్మల్, జనవరి 6(నమస్తే తెలంగాణ) : బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో విద్యాశాఖ సర్వే నిర్వహిస్తున్నది. గత నెల 10వ తేదీన ప్రారంభమైన సర్వే ఈ నెల 11వ తేదీన ముగియనున్నది. 48 క్లస్టర్ల పరిధిలో 45 మంది సీఆర్పీలు గ్రామాలు, పట్టణాల్లో సర్వే చేస్తున్నారు. 6-14 ఏండ్లు, 15-19 ఏండ్ల లోపు బడిబయట బాలబాలికలు ఎంత మంది ఉన్నారని చూస్తున్నారు. అసలు బడిలో చేరని వారు, బడిలో చేరి 30 రోజులకు పైగా గైర్హాజరవుతున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. 19మండలాల పరిధిలో 155 మందిని గుర్తించారు. వీరిలో 6-14 ఏండ్ల లోపు పిల్లలు 112, 15-19 ఏళ్ల లోపు పిల్లలు 43 మంది ఉన్నారు. ఈ నెల 11 వరకు సర్వే ఉండడంతో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గత నవంబర్ 1వ తేదీ నుంచి వరుసగా 30 రోజులపాటు హాజరు కాని వారిని లాంగ్ డ్రాపౌట్స్‌గా గుర్తించారు. వారిని కూడా తిరిగి పాఠశాలకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ గుర్తించిన పిల్లల వివరాలను చైల్డ్ ఇన్ఫో.ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కాగా.. పాఠశాల వయసు పైబడిన వారిని ఓపెన్ స్కూల్‌లో చదువు కొనసాగించేలా ప్రోత్సహిస్తామని, వంద శాతం లక్ష్యం దిశగా ముందు కు వెళ్తున్నామని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఇదీ పరీక్షా సమయం.. కాలక్షేపం వద్దు..

- మార్చి 18 నుంచి పది పరీక్షలు
- ప్రణాళికా బద్ధంగా చదివితే సులువుగా విజయం

తరగతి గదుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

భైంసా టౌన్, జనవరి 6 : 'పది' షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ సమయం విద్యార్థులకు అత్యంత కీలకం. ప్రణాళిక ప్రకారం చదవాలని, ఒత్తిడికి గురికాకుండా ముందడుగు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. సమయపాలన ముఖ్యమని పేర్కొంటున్నారు. కాలక్షేపానికి తావివ్వకూడదని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలతో గడపడం, కబుర్లు, షికార్లు, బైక్ రైడింగ్‌లు, సినిమాలకు దూరంగా ఉండాలని పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు కూడా ఇంట్లో చదువుకునే వాతావరణం కల్పించాలని సూచిస్తున్నారు. వసతి గృహాల్లో కూడా సంక్షేమాధికారులు స్టడీ అవర్స్ నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. మనసు నిద్ర కోరితే కాస్త విశ్రమించడం మంచిదని తెలుపుతున్నారు. ఆ సమయంలో బలవంతంగా నిద్ర ఆపుకొని చదవడం వల్ల ఏ విషయమూ మెదడుకు చేరకపోగా అనారోగ్యానికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. రాత్రి 11 గంటల తరువాత చదవడం మంచిది కాదని, సరైన నిద్ర లేకుంటే మెదడుకు అలసట కలిగి చదివిన అంశాలు గుర్తుండవంటున్నారు. వేకువజామున 3 నుంచి రాత్రి 11 గంటల వరకూ చదివేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలంటున్నారు. ఈ సమయంలో మెదడులో ఎలాంటి ఆలోచనలు ఉండవని, వాతావరణం కూడా ప్రశాంతంగా ఉంటుందని, చదివినవి కూడా త్వరగా మెదడుకు చేరుతాయని సలహాలు ఇస్తున్నారు.

కాల విభజనే ముఖ్యం

మనస్తత్వ శాస్త్రం ప్రకారం కాలవిభజన ప్రాముఖ్యతను పరిశీలిస్తే రోజులో నిద్రకు 6-8 గంటలు కేటాయించాలి. అదికాకుండా కనీసం 2-4 గంటలు కాలకృత్యాలు, వ్యాయమం ఇతర వ్యాపకాలకు కేటాయిస్తే ఇక మిగిలేది 12 గంటలే. ఈ సమయం చాలు ఒక విద్యార్థి పరీక్షల్లో గొప్ప ఫలితాలు సాధించడాకని తెలుపుతున్నారు. సమయాన్ని సరిగ్గా వినియోగించుకోకపోయినా, పక్కా కార్యాచరణ అమలు చేసుకోకపోతే ఓటమి తప్పదని విద్యానిపుణులు అంటున్నారు.

విజేత జట్టుకు బహుమతి ప్రధానం చేస్తున్న ఎంపీపీ పద్మ

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి

లక్ష్మణచాంద, జనవరి 6 : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతున్నదని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. నిర్మల్ జిల్లా జట్టుకు మొదటి స్థానం లభించగా, ఆదిలాబాద్ జట్టుకు ద్వితీయ స్థానం లభించింది. గెలుపొందిన జట్లకు ఎంపీపీ పద్మ బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నవీన్, మండల నోడల్ అధికారి అశోక్ వర్మ, ఎఫ్ఏవో, జిల్లా పరీక్షల విభాగం కమిషనర్ సిద్ధ పద్మ, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వై. రమణారావు పాల్గొన్నారు.